ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024



ఎస్‌బీలో ఫ్యాన్‌ ఫ్యాన్స్‌

జిల్లాలో జరిగే ప్రతి చిన్నకదలికను సైతం గుర్తిస్తూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు చేర వేసే కీలక విభాగాలు స్పెషల్‌ బ్రాంచ్‌ (ఎస్‌బీ), ఇంటలిజెన్స్‌. ఎస్పీకి ముందుగా వచ్చే ఫీడ్‌ బ్యాక్‌తో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కుట్రలు జరగకుండా కట్టడి చేస్తూ ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇంత పవర్‌ ఫుల్‌ విభాగాల్లో సైతం కీలకంగా పనిచేస్తూ కొందరు వైసీపీ ఫ్యాన్స్‌ ఉన్నారు. ఎస్పీకి వచ్చే ఫీడ్‌ బ్యాక్‌ విషయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే అసాంఘిక చర్యలు, ఇతర వ్యతిరేక శక్తుల సమాచారాన్ని పోలీసు బాస్‌కు అందించేకంటే ముందు వైసీపీ నేతలకు అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎస్‌బీలో కొందరు వైసీపీ నాయకుల ఫ్యాన్స్‌ ఉన్నారంటారు. ముఖ్యంగా పులివెందుల సిఫారసుతో ఏళ్ల తరబడి ఎస్‌బీ, ఇంటెలిజెన్స్‌లో కొనసాగుతూ సమాచారాన్నంతా అక్కడికి చేరవేస్తున్నట్లు ప్రచారం ఉంది.

- వైసీపీ సిఫారసుతో పోస్టింగ్‌
- మినిట్‌ టు మినిట్‌ సమాచారం వైసీపీకి చేరవేత
- కొన్నేళ్లుగా జిల్లాలో ఇష్టారాజ్యంగా గంజాయి అమ్మకాలు
- కొనసాగుతున్న బెట్టింగ్‌
- అయినా చర్యలు శూన్యం
- ఏళ్లతరబడి తిష్టవేసిన అధికారులతోనే ఈ తతంగం
- ప్రక్షాళన చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, క్రికెట్‌ బెట్టింగ్‌, జూదం, ఇసుక, మట్టిమాఫియా రాజ్యమేలుతుంది. వైసీపీ హయాంలో అయితే ఇష్టారాజ్యంగా దోపిడీ జరిగింది. అయితే వాటిని కొందరు ఎస్‌బీ సిబ్బంది పైస్థాయికి తీసుకురాకుండా తుంగలో తొక్కినట్లు చెబుతారు. అందుకే ఉత్తరాంధ్రలోని కాశిబుగ్గలో దొరికే గంజాయి ఇప్పుడు కడప గడపలో విచ్చలవిడిగా వాటర్‌బాటల్స్‌లాగా దొరుకుతుంది. అంటే నిఘా వ్యవస్థ ఎంత అట్టర్‌ఫ్లాప్‌గా ఉందో తెలుసుకోవచ్చు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ముక్కుసూటిమనిషిగా పేరుంది. శాంతిభద్రతల్లో రాజీ పడకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తారంటారు. ఆయన పనిచేసిన చోట ట్రాక్‌ రికార్డు బాగుంది. అయితే అలాంటి వ్యక్తి ఇప్పుడు కడప ఎస్పీగా వచ్చారు. ఈ జిల్లా ఆయనకు సవాల్‌ లాంటిది ఎందుకంటే మాజీ సీఎం, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సొంతజిల్లా. ఇక్కడ ఏం జరిగినా కూడా స్టేట్‌లో సంచలనంగా మారుతుంది. ఇక్కడ శాంతిభద్రతలు సవాల్‌ లాంటివి. అయితే ఇప్పుడు ఎస్పీ తన సొంత శాఖను ప్రక్షాళన చేసి పవర్‌ఫుల్‌ టీంను ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడంతా ఎస్‌బీ, ఇంటెలిజెన్స్‌లో పులివెందుల సిఫారసులతో పాటు కొందరు పనిదొంగలు పాస్‌పోర్టు, ఉద్యోగ ఎంక్వయిరీకి వచ్చే వారి నుంచి ఆమ్యామ్యాలు తీసుకుని అక్కడే తిష్టవేశారు. ఇలాంటి వారి వల్ల వారికి సొంత మేళ్లు తప్ప పోలీసు వ్యవస్థకు, సమాజానికి పెద్దగా పేరు ఉండదనే విమర్శలున్నాయి.

ఏళ్ల తరబడి తిష్టవేశారు..

జిల్లాలో 60 పోలీసుస్టేషన్‌లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లో ఎస్‌బీకి సంబంధించి ఒక కానిస్టేబుల్‌ ఉంటారు. ఆ నియోజకవర్గానికి సంబంధించి పర్యవేక్షణ కోసం ఒక ఇన్‌చార్జ్‌ ఉంటారు. ఎస్‌బీలో ఇద్దరు సీఐ, ఎస్‌ఐలు ఉంటారు. జిల్లాలో స్పెషల్‌ బ్రాంచ్‌ అంటే .. పోలీసు పవర్‌ఫుల్‌ వ్యవస్థ. చీమచిటుక్కుమన్నా కూడా డేగ కళ్లతో కనిపెట్టి ఇట్టే సమాచారం ఇస్తారు. అసాంఘిక శక్తులు పొంచి ఉన్నా కనిపెట్టి అటాక్‌ చేస్తారు. అయితే అలాంటి వ్యవస్థ వైసీపీ పాలనలో నిర్వీర్యమైపోయింది. కారణం.. పులివెందుల సిఫారసుతో అక్కడే కొనసాగడం, ఏళ్ల తరబడి తిష్టవేయడంతో మట్కా, బెట్టింగ్‌, గంజాయి మాఫియాతో సంబంధాలు పెట్టుకుని ఒరిజినల్‌ ఫీడ్‌బ్యాక్‌ను ఎస్పీకి అందించకుండా లోకల్‌లోనే తొక్కిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కడపలో వన్‌టౌన్‌లో ఓ అధికారి 12 సంవత్సరాలు, టూటౌన్‌లో సుమారు 13 ఏళ్లు, వన్‌టౌన్‌లో 8 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వన్‌టౌన్‌, టూటౌన్‌ అనేది గంజాయికి కేరాఫ్‌ కేంద్రాలు. కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు తప్ప అంతకు ముందు గంజాయి నిర్మూలన కోసం తీసుకునే చర్యలు నామమాత్రమే. ఇక కడపలో అయితే గంజాయి, బెట్టింగ్‌ సాగుతోంది. ప్రొద్దుటూరులో క్రికెట్‌ బెట్టింగ్‌, గంజాయి, సెటిల్‌మెంటుకు అడ్డాగా మారింది. అక్కడ పోలీసు వ్యవస్థనే వైసీపీ నేతల చంకలో ఉందనే అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అన్బురాజన్‌ ఎస్పీగా ఉన్నప్పుడు క్రికెట్‌బెట్టింగ్‌ ఇతర అభియోగాలపై తొమ్మిది మంది కానిస్టేబుళ్లను అన్నమయ్య జిల్లాకు ట్రాన్స్‌ఫర్‌ చేశారు. అయితే మళ్లీ సేమ్‌ టు సేమ్‌ ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. అంటే దీన్ని బట్టి చూస్తే పోలీసుశాఖలోనే సంచలనంగా మారింది.

మినిట్‌ టు మినిట్‌ సమాచారం..

ఆర్మీ తరువాత పోలీసు క్రమశిక్షణకు పెద్ద పేరు. ఏదైనా ఆరోపణలు వచ్చినా, పత్రికల్లో వార్తలు వచ్చినా వెంటనే చర్యలు తీసుకుంటారు. దేశరక్షణలో ఆర్మీ ఎంత కీలకమో జిల్లాలో శాంతిభద్రతల రక్షణలో పోలీసుశాఖ అలాంటిది. అందుకే ఆ శాఖలో పత్రికల్లో ఎలాంటి వార్తలు వచ్చినా విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకుంటారు. అయితే జగన్‌ పాలనలో అదంతా అటకెక్కింది. వైసీపీ నేతలు కొందరు పోలీసులు కుమ్మక్కై దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లుగా తయారై పోలీసు ఖాకీ యూనిఫాంకే మచ్చ తెచ్చేలా ప్రవర్తించారంటారు. జూదం, గంజాయి, మట్టి ఇలా ఒకటేంటి అన్నింటినీ అక్రమాలు చేశారంటారు. ఈ కారణంగా జిల్లాలో గంజాయి రవాణా భారీగా జరుగుతోంది. ఇక కీలకమైన ఎస్‌బీలో కూడా కొందరు ఇక్కడే రింగ రింగ అంటూ అటు ఇంటెలిజెన్సీ ఎస్‌బీ ఇలా వారి చుట్టూ తిరుగుతూ ఇక్కడే తిష్ట వేశారు. పులివెందుల నేతల ఆశీస్సులు ఉండడంతో ఉద్యోగాలు రావడం, వారి ఆశీస్సులతో అక్కడే ఏళ్లతరబడి కొనసాగిన అధికారులు జిల్లాలో ఏం జరిగినా కూడా మినిట్‌ టు మినిట్‌ సమాచారాన్ని పోలీసు వ్యవస్థ కన్నా పులివెందులబాస్‌కు పంపిస్తారనే ప్రచారం ఉంది. ఇప్పుడు కొత్తగా ఎస్పీ వచ్చారు. అందులో కడప అనేది కీలకమైన జిల్లా. ఇక్కడ ఏం జరిగినా స్టేట్‌లో సంచలనం. అయితే సొంత వ్యవస్థను ప్రక్షాళన చేసి.. మెరుగైన సిబ్బందిని నియమించుకుంటే మినిట్‌ టు మినిట్‌ సమాచారం కడపకు వస్తుంది. సేమ్‌ టు సేమ్‌ బ్యాచ్‌ అయితే మినిట్‌ టు మినిట్‌ పులివెందులకు వెళుతుందనే ప్రచారం ఉంది.

హైకోర్టు ఆదేశించినా.. అక్రమ కట్టడాలపై చర్యలు శూన్యం

- కొత్తపల్లె కాలువ కబ్జాపై చర్యలేవి
- సర్వేచేసి ఆక్రమణలు గుర్తించిన అధికారులు
- అక్రమ నిర్మాణదారులకు ఫైనల్‌ నోటీసులు ఇచ్చిన కార్యదర్శి
- అయినా తొలగని అక్రమ కట్టడాలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 4: సాక్షాత్తు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశించినా.. ఇక్కడి పంచాయతీ, రెవెన్యూ అధికారులు కేవలం నోటీసులకు పరిమితమయ్యారు. అక్రమ కట్టడాలు తొలగించకుండా మీనమేషాలు లెక్కపెడుతున్నారు. కొత్తపల్లె పంచాయితీ టీచర్సు కాలనీలోని కొత్తపల్లె చానల్‌ ఉపకాలువ ఆక్రమణపై మార్చి 1న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సర్వే నెంబరు 411లోని 42 సెంట్ల కాలువను ఆక్రమించి.. భవనాలు నిర్మించడంపై కథనంలో వెల్లడించడం జరిగింది. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి కాలువలో ఆక్రమణలు గుర్తించారు. ఈ కాలువ 42 సెంట్లలో దాదాపు 32 సెంట్ల మేర ఆక్రమణకు గురైనట్లు మండల విలేజ్‌ సర్వేయర్లు రెవెన్యూ తహసీల్దారుకు నివేదిక ఇచ్చారు. ఇందులో కొన్ని బేస్‌మట్టాలు, రోడ్డు నిర్మాణం, భవన నిర్మాణం జరిగిందని వెల్లడించారు.

హైకోర్టు ఆదేశించినా.. కదలని యంత్రాంగం

కొత్తపల్లె ఉపకాలువ ఆక్రమణలపై హ్యూమన్‌రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి హైకోర్టులో పిల్‌ దాఖలు చేశారు. హైకోర్టు కూడా ఈ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు, ఆర్డీవోలకు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో కలెక్టరు పంచాయతీ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మూడు నోటీసులు ఇచ్చిన పంచాయితీ కార్యదర్శి

411 సర్వే నెంబరులోని కాలువను ఆక్రమించి పూడ్చివేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి జూలై 1, 8, 15 తేదీలలో వరుసగా మూడు నోటీసులను కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి ఇచ్చారు. కానీ నేటికి ఆ భవన యజమాని అక్రమ కట్టడాలను తొలగించుకోలేదు. కారణం ఆ భవన యజమాని వైసీపీకి చెందిన నాయకుడు కావడం వల్ల అధికారులు ధైర్యంగా చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా ఇందులో కొందరు అధికారులకు మామూళ్లు ముట్టడంతో వారు నేరుగా వెళ్లి అక్రమ నిర్మాణం కూల్చడానికి వెనుకాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైసీపీ ప్రభుత్వం మారినా..

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. కానీ ప్రభుత్వం మారినా వైసీపీ నేతల భూదందాలు సాగుతూనే వున్నాయి. ఇందుకు నిదర్శనం కొత్తపల్లె కాలువను కబ్జా చేసి పూడ్చివేసి అక్రమ నిర్మాణం చేపట్టమే . గత ప్రభుత్వంలో అధికారులు పట్టించుకోలేదు. కానీ ఈ ప్రభుత్వంలో కూడా ఇంకా అధికారులు చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కపెడుతున్నారు.

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటూ..

కొత్తపల్లె కాలువను కబ్జాచేసి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే ఇక్కడి అధికారులు నోటీసులకు పరిమితమై అక్రమ కట్టడాలు తొలగించలేదు. దీనిపై హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్‌ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారంటూ హైకోర్టుకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి కైనా రెవెన్యూ, పంచాయతీ అధికారుల వెంటనే అక్రమ కట్టడాలు తొలగించే పనులను మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువ పూడ్చి ఇంటి నిర్మాణం చేపట్టిన దృశ్యం

భూబాధితులకు అండగా పోరాడతాం

- 20న విజయవాడలో రెవెన్యూ భూబాధితుల సమావేశం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మదనపల్లె అర్బన్‌, ఆగస్టు 4: రెవెన్యూ భూబాధితులకు అండగా పోరాడతామని, రెవెన్యూ అధికారులు, భూకబ్జాదారులు కలిసి చేసిన అక్రమాలు, అవినీతి బయటపడకుండా ఉండడం కోసమే రికార్డులను తగలబెట్టారని, భూకబ్జాలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నైతిక బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్‌ సర్కిల్‌లోని కాజ్‌భవన్‌ ఫంక్షన్‌ హాల్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అధ్యక్షతన రెవెన్యూ భూబాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ పలుకుబడితో పేదల భూములను లాక్కున్నారని, అనేకమంది పేదలు తమ భూములను ఇప్పించండి అని మదనపల్లె సబ్‌కలెక్టర్‌ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో భూఆక్రమణలు జరిగినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. బాధితుల తరఫున వీటన్నింటిపై ఇదివరకే సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడామని తెలిపారు. బాధితులకు అండగా సీపీఐ నిలబడిందని, బాధితులతో కలిసి ఈనెల 20వ తేదీ విజయవాడలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌ పరిధిలో రెవెన్యూ అధికారులు, భూఆక్రమణదారులు కలిసి రాజకీయ అండతో వెయ్యి ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు చెరువులు కబ్జా చేశారని, అవి బయటపడకుండా ఉండేందుకే రికార్డులను దహనం చేశారని తెలిపారు. అనంతరం మదనపల్లె, పీలేరు, నియోజకవర్గంలోని భూబాధితులు వారి సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సహాయ కార్యదర్శి మహేష్‌, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, సుధీర్‌కుమార్‌, మనోహర్‌రెడ్డి, సుమిత్ర, నియోజకవర్గ కార్యదర్శి మురళి, మాధవ్‌, తదితరులు పాల్గొన్నారు.





చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగాజమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట వీధి నుంచి కలశాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 4: గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో రద్దీగా మారాయి. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

కన్నీరు మిగిల్చిన ఖరీఫ్‌

వ్యవసాయ జూదంలో అన్నదాత మరోసారి కుదేలయ్యాడు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ముందస్తుగా కురిసిన వర్షాన్ని నమ్ముకుని వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారు. నెల రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో సాగుచేసిన పంటలన్నీ నిలు వునా ఎండిపోయాయి. దీంతో చేసేది లేక రైతులు ఇప్పటికే మినుము పంటను దున్నేస్తున్నారు. ఇతర పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అలాగే ఉంది.

- నెల రోజులుగా చినుకు పడక..
- సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి..
- మినుము పంటను దున్నేస్తున్న రైతులు
- పత్తి, కంది, వేరుశనగ పంటల పరిస్థితి అంతే..



ట్రాక్టర్‌తో మినుము పంటను దున్నేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 4: జిల్లాలో గత సంవత్సరం ఖరీఫ్‌, రబీలో పంటలు సాగు చేసి దెబ్బతిన్న అన్నదాతలు ఈసారైనా పంటలు బాగా పండుతాయని ఆశించారు. ఈ ఏడాది జూన్‌లో మంచి వర్షం కురవడంతో మినుము, పత్తి, వేరుశనగ, కంది పంటలు సాగు చేశారు. అయితే విత్తనం వేసినప్పటి నుంచి మబ్బులు పట్టి ఊరించడం తప్ప ఒక్క పదును వాన పడలేదు. దీంతో సాగు చేసిన పంటలన్నీ వాడుముఖం పట్టి ఎండిపోయాయి. ఎర్రగుంట్ల మండలంలో 555 ఎకరాలో మినుము పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.10వేలు కర్చు చేశారు. రెండు సార్లు మందులు కొట్టారు. నెల రోజుల నుంచి వర్షం రాకపోవడంతో పంటంతా నాశనమైపోయింది. ఇక వర్షం వచ్చినా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని.. రైతులు పంటను దున్నేస్తున్నారు.

ఇతర పంటల పరిస్థితి అంతే..

మినుముతో పాటు పత్తి, వేరుశనగ, కంది పంటను సాగు చేశారు. కంది 43హెక్టార్లు, పత్తి 104 హెక్టార్లు, వేరుశనగ 38 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణంగా జూన్‌లో 120 మి.మీ వర్షం పడాల్సి వుండగా.. 150 మి.మీ వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఎన్నో ఆశలతో విత్తనం విత్తారు. అయితే జూలైలో 96 మి.మీ వర్షం పడాల్సి వుండగా.. కేవలం 31 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. అది కూడా ఒకేసారి కాకుండా 5, 6 మి.మీ కురవడంతో.. అది పంటకు తేమను అందించలేక పోయింది. ఇక ఆగస్టులో సాధారణ వర్షపాతం 110 మి.మీ కాగా ఇప్పటి వరకు చినుకు పడకపోవడంతో పంటలన్నీ ఎండి పోయాయి. దీంతో ఇప్పటికే మినుము పంటను రైతులు పూర్తిగా దున్నేస్తుండగా... ఇతర పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్‌ సబ్సిడీ అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

30 ఎకరాల్లో సాగుచేశా..



30 ఎకరాల్లో మినుము పంటను సాగుచేశాను. రెండు సార్లు మందు కొట్టాను. ఎకరాకు రూ.10వేలకు పైబడి ఖర్చు అయ్యింది. సరైన వర్షం రాకపోవడంతో పంట వాడిపోయి ఎండిపోతోంది. దీంతో దున్నేస్తున్నాను. దాదాపు రూ.3.50 లక్షలు నష్టం వచ్చింది. గత సంవత్సరం రబీలో కూడా బుడ్డశనగ పంట వేసి వర్షం రాక భారీగా నష్టపోయాను. ప్రభుత్వం ఇన్‌పుట్‌ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి.

- వీరబోయిన రాధాక్రిష్ణ, రైతు ఎర్రగుంట్ల

ఈ-క్రాప్‌ చేయించుకుంటేనే..

మినుము సాగు చేసిన రైతులు పంటను దున్నేస్తున్నారు. పంట సాగు చేసి దెబ్బతిన్న రైతులు పంట నమోదు చేయించుకోవాల్సిందే. లేదంటే ఇన్‌పుట్‌ సబ్సిడీ, పంటల బీమా వర్తించదు. ఈ-క్రాప్‌ చేసేందుకు ప్రభుత్వం నుంచి యాప్‌ శుక్రవారం వచ్చింది. వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. సోమవారం నుంచి ఈ-క్రాప్‌ మొదలుపెట్టి వర్షాధార పంటలు సాగుచేసిన రైతుల వివరాలు నమోదు చేస్తాము. రైతులు కూడా తప్పనిసరిగా తమ పంటను దున్నేసే సమయంలో ఖచ్చితంగా వ్యవసాయ అధికారులకు తెలపాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, ఏవో ఎర్రగుంట్ల



ఎండిపోతున్న మినుము పంట

ఆర్టీసీని ప్రక్షాళన చేస్తాం

- ప్రయాణికులకు నాణ్యమైన సేవలందిస్తాం
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవి

కడప (మారుతీనగర్‌) ఆగస్టు 4: వైసీపీ గత ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యం అయిందని.. రానున్న రోజుల్లో ఏపీఎస్‌ఆర్టీసీని ప్రక్షాళన చేసి.. ప్రయాణీకులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అద్దె (హయ్యరు) బస్సుల సేవలను వినియోగిస్తుందన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నూతన గ్యారేజీ ప్రాంగణంలో ఆదివారం కడప రీజియన్‌ పరిధిలోని వివిధ డిపోలకు చెందిన 18 నూతన బస్సులను కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థలో ప్రజలకు అత్యంత భద్రత, సులభతర, సుఖమయ ప్రయాణ సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల వ్యవ ధిలోనే సుమారు 1400 కొత్త బస్సులు ఆర్టీసీ పరిధిలోకి వచ్చాయన్నారు. ఇప్పటికే సుమారు 400 బస్సులు సర్వీసులు అందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం కడప డిపో నుంచి 18 నూతన బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో రెండు ఇంద్ర, ఒక సూపర్‌ లగ్జరీ బస్సులు ఉన్నాయన్నారు. మరిన్ని కొత్త బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేసి మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ మన జీవితంలో ఆర్టీసీ బస్సు ఒక భాగమన్నారు. గ్రామాలకు సైతం బస్సులు నడుస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. కాగా, ఆర్టీసీ అధికారుల కార్యాలయాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటు చేయాలని ఆర్టీసీ కడప రీజనల్‌ మేనేజర్‌ గోపాల్‌రెడ్డికి మంత్రి రాంప్రసాద్‌ రెడ్డి ఆదేశాలిచ్చారు.

మంత్రికి ఘన స్వాగతం

కొత్త బస్సుల ప్రారంభోత్సవానికి కడప బస్టాండుకు వచ్చిన రవాణాశాఖ మంత్రికి ఆర్టీసీ కార్మికపరిషత్‌ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోనల్‌ కార్యదర్శి పురుషోత్తం, కడప డిపో గౌరవాధ్యక్షుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు కడప డిపో డ్రైవర్లకు నైట్‌ అవుట్‌ డ్యూటీలు కలపడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందించి త్వరలో సమస్యను పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌ బ్యూరో సభ్యుడు ఆర్‌.శ్రీనివాసరెడ్డి, బద్వేలు, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ నాయకులు విజయమ్మ, భూపేశ్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, కడప డిపో మేనేజర్‌ ఢిల్లీశ్వరరావు, ఆర్టీసీ యూనియన్‌ల నాయకులు కేకే కుమార్‌, ఏఆర్‌ మూర్తి, టి.జయ రామ్‌, ఆర్టీసీ, ప్రైవేటు అద్దెబస్సుల సంఘం అధ్యక్షుడు పాలగిరి భాస్కర్‌, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణిస్తూ టికెట్‌ కొనుగోలు చేస్తున్న మంత్రి

'వైసీపీ' నిర్లక్ష్యం రైతులకు శాపం

లైనింగ్‌కు నోచుకోని వెలిగల్లు కుడికాల్వ



లైనింగులకు నోచుకోని ప్రధాన కాల్వలు ● గతేడాది వృధాగా పోయిన నీళ్లు

● సొంత డబ్బుతో పిల్లకాల్వలు తవ్వుకున్న రైతులు

● చివరి ఆయకట్టు వరకు నీరు పారడం ప్రశ్నార్థకం

గాలివీడు, ఆగస్టు4: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం రైతుల పాలిటి శాపంలా పరిణమించింది. ఐదేళ్ల వైసీపీ పాలన లో ఉన్న నీటిని కూడా రైతులు ఉపయోగించుకోలేని దుస్థితి దాపురించింది. ప్రధాన కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో గతేడాది నీళ్లన్నీ ఏటి పాలయ్యాయి. 'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని ఉన్న' చందంగా వెలిగ ల్లు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి తయారైంది. వెలిగల్లు మూడు మండలాల రైతులకు గుండెకాయ లాంటి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారు. కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. అయితే రైతులకు కలుగుతున్న ప్రయోజనం అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉన్న నీటిని వినియోగించుకోలేక పోవడానికి కారణంగా ప్రధాన కాల్వలకు లైనింగ్ లేకపోవడాన్ని చెప్పవచ్చు. ఫలితం గా వేలాది ఎకరాల వ్యవసాయ భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. రాయ చోటి నియోజకవర్గంలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో 24 వేల ఎకరాలకు సాగు నీరు, లక్ష జనాభాకు తాగునీరు అందివ్వాలనే ఆశయంతో గాలివీడు కు సమీపంలోని పాపాఘ్ని నదిపై వెలిగల్లు ప్రాజెక్టు ను చేపట్టారు. 2003-04లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 4.64 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి 2008 డిసెంబర్ 22న రైతులకు అంకితం చేసింది.

పాలకుల నిర్లక్ష్యం - రైతులకు శాపం

వెలిగల్లు ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాల్వలున్నాయి. కుడికాల్వ గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల పరిధి లోని 52 కిలోమీటర్ల పొడవునా 23,400 ఎకరాలకు సాగునీరు అందించనుంది. ఎడమకాల్వ వెలిగల్లు, తూముకుంట పంచాయతీలో 10 కిలోమీటర్ల పొడవునా 600 ఎకరాలకు సాగునీరు అందించనుంది. అయితే ఐదేళ్లలో వెలిగల్లు ప్రాజెక్టు పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని అవలంబించినట్లు స్పష్టంగా తెలుస్తోంది గతంలో ప్రాజెక్టులో నీళ్లున్నా వాటిని వ్యవసాయ భూములకు అందించ లేకపోయారని ఆరోపణ లున్నాయి. ప్రాజెక్టు కాల్వలకు లైనింగ్‌లు వేయకపోవడం వల్ల నీళ్లున్నా జల్లెడ మాదిరి కారి తిరిగి ఏటికి చేరుకున్నాయి. కుడికాల్వకు 10 కిలోమీటర్ల మేర లైనింగ్ ఉన్నా మిగతా కాల్వకు లైనింగ్ లేకపోవడం వల్ల నీరంతా వృధాగా కారిపోయింది. కాల్వలకు వదిలిన నీటిలో 25 శాతం కూడా కాల్వ చివరికి చేరకపోవడం చూస్తే కాల్వల పరిస్థితి ఎలాఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా మండల పరిధిలోని గుండ్లచెరువు పంచాయతీలోని కొంత భాగం, పందికుంట, కొర్లకుంట పంచాయతీల్లో వెళుతున్న కాల్వలో ఎక్కువగా నీరు కారిపోతున్నాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో వెళుతున్న కాల్వకు లైనింగ్‌లు లేకపోవడంతో నీరు వృధాగా కారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి ప్రభుత్వ మైనా వెలిగల్లు కాల్వలకు మరమ్మత్తులు చేపట్టి చివరి ఆయకట్టుకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని పిల్లకాల్వలు

వెలిగల్లు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద 143 కిలోమీటర్ల పిల్లకాల్వలున్నాయి. ఈ పిల్ల కాల్వలు ప్రస్తుతం మట్టి, బండరాళ్లు, చెట్లతో నిండిపోయా యి. వీటిగుండా నీళ్ల పారే పరిస్థితిలేదని రైతులు వివరిస్తున్నారు. ప్రధాన కాల్వల కింద తక్కువ భూమి సాగులోకి వస్తుందని, కానీ పిల్ల కాల్వల కింద అధిక విస్తీర్ణంలో సాగుభూమి ఉందన్నారు. ఒక గుత్తేదారు కాల్వలను తవ్వకుండా తవ్వినట్లు రూ.8 కోట్లు బిల్లులు చేసుకున్నాడని ఆయన నిర్ల క్ష్యంతో కొన్ని భూములకు నీళ్లు అందలేదని పలువురు రైతులు ఆరోపించారు. కొందరు రైతులు సొంత డబ్బుతో పిల్లకాల్వను తవ్వుకుని వ్యవసాయం చేసుకున్నట్లు తెలిపారు.

బీడుగా వ్యవసాయ భూములు

వెలిగల్లు కాల్వలకు లైనింగ్ వేయకపోడం, పిల్ల కాల్వలకు మరమ్మత్తులు చేయకపోవడం వల్ల కాల్వ లో నీరు పారే పరిస్థితి తక్కువ. తద్వారా వ్యవసాయ భూములన్నీ బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన కాల్వ, పిల్లకాల్వలు సక్రమంగా ఉండి ఉంటే ఈ పాటికే కాల్వలకు నీరు వదిలి ఉండేవారని, తద్వారా భూములన్నీ పాడి పంటలతో కళకళలాడుతూ ఉండేవని పలువురు రైతులు పేర్కొన్నారు. తీవ్ర వర్షాభావం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కాల్వలకు నీళ్లువదిలి ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వెలిగల్లు కాల్వల దుస్థితిపై ప్రాజెక్టు డీఈ శరీఫ్ కుమార్‌ను వివరణ కోరడానికి ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.



చెట్లు, రాళ్లతో నిండిన పిల్ల కాల్వలు



లైనింగ్ లేక కాల్వ కింద వృథాగా కారుతున్న నీరు (ఫైల్‌ఫొటో)

సొంత డబ్బుతో కాల్వలు తవ్వుకున్నాం



వెలిగల్లు ప్రాజెక్టు కుడికాల్వ మా గ్రామానికిపైన వెళుతోంది. అయితే నీరు పారే భూములు తక్కువ. గతేడాది పిల్లకాల్వలు మట్టి, చెట్లతో పూడిపోయాయి. రైతులంతా కొన్ని పిల్లకాల్వల్లోని మట్టిని, చెట్లను తొలగించారు. కొన్నింటిని సొంత డబ్బుతో ఎక్స్‌కవేటర్లు పెట్టుకుని తవ్వుకున్నాము. ఈ ఏడాది కూడా పిల్లకాల్వలు చెట్లు, రాళ్లతో పూడిపోయాయి. ప్రభుత్వం స్పందించి పిల్లకాల్వలకు మరమ్మత్తులు పనులు చేపట్టాలి.

మహేశ్వర్‌రెడ్డి, నాయునివారిపల్లె, కొర్లకుంట

టీచర్ల పనిసర్దుబాటు నిలిపివేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4: జీఓ117 ఆధారంగా టీచర్లను పనిసర్దుబాటు చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, వెంటనే పదోన్నతులు చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించే జీఓ 117ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పిన విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ అదే జీఓ 117 ఆధారంగా టీచర్ల సర్దుబాటు చేయడం ఏ మాత్రం సమంజసంకాదన్నారు. పదిమందిలోపు విద్యార్థులున్న ధార్మిక పాఠశాలలు మూసివేయాలని విద్యాశాఖాధికారులు చెబుతున్నారని పాఠశాలలను మూసివేయడం వల్ల పేద బలహీన వర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమవుతారన్నారు. తక్షణం ఈ ఆలోచన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, గురయ్య, భాస్కర్‌రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలజోజి, అబ్దుల్‌సత్తార్ పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఆగస్టు 4: ప్రకాష్‌నగర్‌కు చెందిన లక్ష్మీసునీత(30) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లక్ష్మీసునీతకు హిందూపురం వాసి నరసింహులుతో సుమారు 15 ఏళ్లక్రితం వివాహమైంది. అయితే వారు ఎర్రగుంట్లకే వచ్చి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 3గంటలకు ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎర్రగుంట్ల ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి 8వ తరగతి చదివే కుమారుడు, 6వ తరగతి చదివే కుమార్తె ఉన్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో పీడీ, పీఈటీలు

రాయచోటిటౌన్, ఆగస్టు 4: అన్నమయ్య జిల్లా కేంద్రం మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని పులివెందుల, జమ్మలమడు గు, వేముల కొత్తపల్లి, రైల్వేకోడూరు, పుల్లంపేట, రాయచోటి, సుండుపల్లె, మైదుకూరు, ఆగుడూరు, కోరకుంటపల్లి, ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచీ సుమారు 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపికలను కడప జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జాయింట్‌సెక్రటరీ జేసునాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, ఆర్గనైజర్, సెలెక్షన్ సెక్రటరీ జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17, 18, 19వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలకు జిల్లా అసోషియేషన్ సభ్యులు గంగులయ్య, వివిధ పాఠశాల పీడీ, పీఈటీలు రవీంద్రరాజు, సుబ్రమణ్యం, వెంకట్రమణ, రవీంద్రనాధరాజు, అబ్దుల్‌కరీం, గంగాశిరీష, చంద్రావతి, నీలకంఠ, సీనియర్ క్రీడాకారులు నాగార్జున, శ్రీను, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లకు ఆకతాయిల నిప్పు



కాలిపోయిన వాహనాలు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 4: స్థానిక శ్రీనగర్ కాలనీలో ఇంటి ముందు నిలిపివుంచిన రెండు బైక్‌లకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. వాహనాల యజమాని రఘునాయుడు తన ఇంటి ముందు వాహనలను పార్కింగ్ చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చినట్లు రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

కాల్వల్లో పూడిక - రోడ్లపైకి మురికి నీరు


మెరుగు పడని పారిశుధ్య సేవలు ● వార్డుల్లో పట్టించుకోని శానిటరీ సెక్రటరీలు



రోడ్డు పైకి చేరిన కాల్వల్లో నీరు

ప్రొద్దుటూరు ఆగస్టు 4: వీధికాల్వల్లో పారిశుధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టకపోవడం వలన మురికి నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ముఖ్యంగా వార్డు స్థాయిలో పారిశుధ్య సేవలు మెరుగుపడడం లేదనే విమర్శలున్నాయి. ప్రజలు కాల్వలపై బండలు వేసి కాంక్రీట్ ర్యాంపులు వేయడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాల్వల్లో చెత్తా చెదారం, మట్టి పూడిక తీయలేని పరిస్థితులు వున్నాయి. అంతేకాకుండా ఇంటింటికీ చెత్తసేకరణ పనులు చాలా వార్డుల్లో పూర్తి స్థాయిలో సాగడం లేదు. రెండేళ్లుగా చెత్త ఆటోలు వీధుల్లో తిరిగి ఇంటింటి చెత్త సేకరించేవి. ప్రసుత్తం 35 ఆటోలకు కేవలం 15 ఆటోలు మాత్రమే వార్డుల్లో చెత్తను సేకరించడం వలన కూడా వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్త కాల్వల్లో పడి మురుగు ప్రవాహం ముందుకు సాగక మురికి కొన్నిప్రాంతాల్లో రోడ్ల మీదికి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు 45 సచివాలయాల్లో వున్న శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణ అంతంత మాత్రమే. వీరు పారిశుధ్య పనులు చేపట్టడం తమ విధులు కావని కొందరు సచివాలయాలకే పరిమితం అవుతున్నారు. కొందరు సెక్రటరీలు ఉదయాన్నే పారిశుధ్య కార్మికులకు మస్టర్ వేయడానికి రావడం లేదు. మరికొందరు వార్డుల్లో పనులు పర్యవేక్షించకుండా గంట అరగంట పాటు వుండి వారి సొంత పనులు చూసుకుంటున్నారు. కొందరు పర్మినెంటు కార్మికులను మేస్త్రీలుగా డిప్యుటేషన్‌పై విధులు అప్పగించినా వారూ సక్రమంగా పని చేయడంలేదని ఆరోపణలున్నాయి. వీరు మేస్త్రీలుగా డిప్యూటేషన్ కోసం అధికారులకు మాముళ్లు ఇవ్వడం వలన తాము పారిశుధ్య పనులు పర్యవేక్షించడం కంటే డబ్బు సంపాదన పనిలోవున్నట్టు ఆరోపణలున్నాయి. ఒక వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టరు లేకపోవడం వలన ఇన్‌చార్జుగా మరో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టరును పెట్టడంతో రెండు డివిజన్లు పర్యవేక్షణ చేయలేక ఇబ్బందిగా మారింది. దీనికితోడు పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లు గ్యాంగ్ వర్కులు చేపట్టడంతో ఆపనుల పర్యవేక్షణ కూడా కొరవడు తోంది. ముఖ్యంగా మున్సిపాలిటీ శానిటేషన్‌కు అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడం వలన కమిషనరే అన్నీ పర్యవేక్షించడం భారంగా మారింది. కొంతకాలంగా అసిస్టెంట్ కమిషనర్ మేనేజర్ పోస్టులు సైతం ఖాళీగా వున్నాయి. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మున్సిపాలిటీలో ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులకు తెలిపి త్వరిగతిన బదిలీపై అధికారులను తెప్పించుకుంటే పరిపాలన గాడిలో పడుతుంది.

'మామిడి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోండి'



తెగి పడిపోయిన మామిడి చెట్లు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4: మామిడి చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు బద్వేలు మండలం కోనసముద్రం వాసి మల్లేశ్వర్‌రెడ్డి భార్య రాజమ్మ బ్రహ్మంగారి మఠం మండలం రేకలకుంట్ల పంచాయతీ సర్వేనెం.814/2, 814/1లలో నాలుగెకరాల పొలం కౌలుకుంది. ఇందులో 200 మామిడి చెట్లు నాటుకుని జీవనం సాగిస్తోంది. కాగా ఆదివారం తెల్లవారుజామున బద్వేలు టౌన్ ఫాతిమానగర్‌కు చెంది న కొందరు తమ పొలంలోకి వచ్చి పొలం మాది, మీకు ఏ విధంగా వస్తుందని కొట్లాడి 200 మామిడి చెట్లను నరికి వేశారని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో తమకు ఐదులక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈవిషయమై ఎస్‌ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ అక్రమంగా మామిడి చెట్లు నరికిన వారిపై చర్యలు చేపడతామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనాథ బాలికలకు రూ.లక్ష సాయం



కర్నూలులో అనాథ బాలికలకు ఆర్థిక సాయం అందిస్తున్న కోడూరు నూర్ బాషా సంఘం

రైల్వేకోడూరు, ఆగస్టు 4: జిల్లా నూర్ బాషా సంఘం ఆధ్వర్యంలో అనాధ బాలికలకు ఆర్థిక సాయం అందించారు. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం గూల్యం వాసులు పి.కాసీంసాబు,షేకమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుమార్తెలు ఆశాబి, నబియా, ఆఫ్రీన్ అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు నూర్ బాషా సంఘం రూ.లక్ష ఆర్థిక సాయం అందించింది. అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆడ పిల్లలకు జీవనాధారం లేకపోవడంతో రైల్వేకోడూరు నూర్ బాషా సంఘం విరాళాలు సేకరించి ఆర్థికసాయం అందించారన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా నూర్ బాషా సంఘం అధ్యక్షుడు పి. మస్తాన్, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పగిడాల సిద్ధయ్య, జిల్లా నూర్ బాషా సంఘం అధ్యక్షుడు నడిగడ్డి ఇమాములు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ - ఒకరి మృతి

మృతుడు కడప జిల్లా వాసి ● మరో ఇద్దరికి గాయాలు



ఉపేంద్రవర్మ మృతదేహం

హుకుంపేట, ఆగస్టు 4: గడుగుపల్లి సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా సిహెచ్.ఉపేంద్రవర్మ (44) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన సిహెచ్.ఉపేంద్రవర్మ ఆదివారం ఉదయం అరకు నుంచి నుంచి పాడేరు వస్తున్నారు. గడుగుపల్లి వద్ద హుకుంపేట మండలం పాతకోట వాసులు రామన్న, చందు బైక్‌పై వస్తూ ఢీకొన్నారు. దీంతో ఉపేంద్రవర్మ బైక్ నుంచి కిందికి జారిపడి స్పృహకోల్పోయారు. సంఘటనా స్థలంలో నే మృతి చెందారు. రామన్న, చందు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సంఘట నా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఉపేంద్ర కుటుంబీకులకు సమాచారం అందించారు. రామన్న, చందు స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు.

నైపుణ్యాలపై శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

వేంపల్లె, ఆగస్టు 4: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం ట్రిపుల్‌ఐటీలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌లో పైతాన్ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వర్క్ షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ సతీష్, బృందం ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు.

కార్యక్రమానికి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్‌ఎస్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రూ.లక్ష ఆస్తి నష్టం



సుండుపల్లె, ఆగస్టు 4: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రూ.ఒక లక్ష ఆస్తి నష్టం జరిగిందని వినాయక నగర్ వాసి రెడ్డెప్పఆచారి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మొదటి అంతస్తు బాడుగ ఇంటికితాళాలు వేసి పనుల నిమిత్తం బయటికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామాగ్రి అంతా కాలిపోయిందన్నారు. ఫ్రిడ్జ్, కూలర్, బీరువా అందులోని పట్టుచీరలు సుమారు రూ.20 వేలు నగదు మండలకు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.ఒక లక్ష ఆస్తినష్టం జరిగినట్టు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులకు స్థానికులు తెలియజేశారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

పెండ్లిమర్రి, ఆగస్టు 4: తుమ్మలూరు పంచాయతీ గోపరాజుపల్లెలో కుక్కల దాడిలో 15గొర్రెలు మృతిచెందాయి. అదే గ్రామానికి చెందిన పంగా భైరేష్‌కుచెందిన ఐదుగొర్రెలు, పంగా ఈశ్వరయ్య ఐదు గొర్రెలు, పంగాగణేష్‌కు చెందిన ఐదు గొర్రెలపై శనివారం రాత్రి కుక్కలు దాడి చేసి చంపాయి. దాదాపు రూ.1.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఒక ఏడాది ఆదాయం నష్టపోయామని, గొర్రెల పెంపకమే జీవనాధారం అని మా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులను కోరారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి జయంత్యోత్సవం





చెన్నూరు చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద భక్తజన సందోహం.. ప్రత్యేక అలంకరణలో సింహవాహినిగా చౌడేశ్వరి దేవి.. శాకాంబరిదేవి అలంకారం

చెన్నూరు, ఆగస్టు 4 : చెన్నూరు రామలింగేశ్వరదేవి 95వ జయంత్యుత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆషాఢ అమావాస్య సందర్భంగా రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో తెల్లవారుజామున 2గంటలకే మూలవిరాట్‌కు పలురకాల అభిషేకాలు జరిగాయి. తెల్లవారుజామున సుప్రభాతపూజ, గణపతి పూజ, నవనదీ జలాలతో అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కుంకుమార్చన చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించగా పలువురు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఉత్సవంలో అమ్మవారిని దర్శించుకునేందుకు మండలంలో నుంచే కాక జిల్లా వ్యాప్తంగా పలువురు హాజరయ్యారు. అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో శాకాంబరిదేవిగా అలంకరించారు. అలాగే మూలవిరాట్‌తో పాటు అమ్మవారికి దసరా ఉత్సవాల వలే ఆలయ మంటపంలో సింహవాహినిగా ఏర్పాటు చేయగా భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జయంతి

కడప (కల్చరల్), ఆగస్టు 4: నగరంలోని ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. వేకువజామున నుంచే అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజాదకాలు నిర్వహించారు. విశేష ద్రవ్య సహిత పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు చౌడేశ్వరిదేవిని దర్శించుకున్నారు. చౌడేశ్వరి దేవి ఆలయ అధ్యక్షుడు కళ్యా సుధాకర్ మాట్లాడుతూ సృష్టి స్వరూపిణి అయిన చౌడేశ్వరి మాతను ఆరాధించడంతోనే సర్వదోషాలు పోయి సుఖశాంతులు నెలకొంటాయన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. చౌడేశ్వరి దేవస్థానం ఉపాధ్యక్షులు కొరముట్ల సుబ్బరాయుడు, రెబ్బ హరిబాబు, కోశాధికారి మల్లిఖార్జున, ఆలయ కమిటీ సభ్యులు మోతుకూరి సుబ్బరాయుడు, మోతుకూరి గురవయ్య, టేకూరి సుదర్శన్, పుష్పాంగద, కలికిరి వెంకటసుబ్బయ్య, వెలిగండ్ల సుబ్బరాయుడు, నల్లమారు రామక్రిష్ణ, కాల్వ గంగాధర్, కె.వీరనరసింహులు, గోవిందు వెంకటరమణ, కంచన రవి, సుబ్బయ్య, ఆలయ మహిళా సేవకులు కాల్వ గౌరీ, వేదవతి, తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం చౌడేశ్వరిదేవి

పెండ్లిమర్రి, ఆగస్టు 4: చౌడేశ్వరి అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా నిలుస్తోందని మాజీ కార్పొరేటర్ ఉమ్మల్ల విశ్వనాథరెడ్డి, రామిరెడ్డి, రామాంజనేయులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎగువపల్లె గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయలో ఆదివారం తెల్లవారుజాము నుంచి విశేషపూజలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటు సమీప గ్రామానికి చెందిన భక్తులు తెల్లవారుజాము నుంచి తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో వచ్చే అమావాస్య రోజు అమ్మవారితో పాటు శివునికి అభిషేకాలు, ఇతరపూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలుస్వీకరించే వారి కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసమన్నారు. ఈ ప్రాంతలో అమ్మవారితో పాటు ఆంజనేయస్వామి కూడా కొలువై ఉండడం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పుకొంటారన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోసుల రారెడ్డి, మునిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిం చ్చుబ్బు, ప్రతాప్‌రెడ్డి, మనోసాగర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మునిరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.




కడప : అన్నదానం చేస్తున్న దృశ్యం .. పెండ్లిమర్రి: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఎండిపోయిన మినుము పైరును పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం బృందం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 4: వర్షాభావంతో పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఎండిపోయిన మినుము పంటను రైతు సంఘం ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావం నెలకొనడంతో పలువురు రైతులు పంటలను తొలగిస్తున్నారన్నారు. వీరితో పాటు కౌలు రైతులు మరింత నష్టపోయారన్నారు. ఎకరాకు రూ.15000 నుంచి రూ. 20వేలు పెట్టుబడి పెట్టారన్నారు. కావున వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిపరిశీలన జరిపినష్టపోయిన రైతులను ఆదుకునేవిధంగా ప్రభుత్వానికి నివేదకలు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శంకర్‌రెడ్డి, నారాయణ, నాగేంద్ర, షరీఫ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ పురోగతికి దోహదపడాలి: ఎమ్మెల్యే



విజేత జట్టుతో ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప (స్పోర్ట్స్), ఆగస్టు 4: యువత క్రీడల్లో రాణిస్తూనే సమాజ పురోగతికి దోహదపడాలని ఎమ్మెల్యే మాధవీ రెడ్డి సూచించారు. ఆదివారం కడప పోలీస్ గ్రౌండ్‌లో ధోని ట్రోఫీ-2024 ఫైనల్ మ్యాచ్ రవీంద్రనగర్ లెవెన్, అల్మాస్‌పేట- లెవెన్ జట్ల మధ్య రసవత్తరంగా సాగింది. ఇందులో తొలుత టాస్ నెగ్గిన రవీంద్రనగర్ జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. అనం తరం బ్యాటింగ్ చేపట్టిన అల్మాస్‌పేట జట్టు 19.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి విజయం సాధించి కప్‌ను కైవసం చేసుకుంది. విజేత జట్టుకు బహుమతి ప్రధాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీ ఖాన్, ట్రోఫీ నిర్వాహకుడు కె.కె.ఆర్ అధ్యక్షుడు తారిఖ్ అలీ, జే.కే యూత్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఇరుజట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

● విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఆపాలి: పీడీఎస్‌యూ



మంత్రితో మాట్లాడుతున్న అంకన్న తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4: రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆదివారం వినతులు వెల్లు వెత్తాయి. జిల్లాలోని గ్రా మీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఆపాలని ఆదివారం కడపకు విచ్చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు గ్రామీణప్రాంతాల నుంచి చదువులు సాగిస్తున్నారన్నారు. జిల్లాలో చెన్నూరు, ఖాజీపేట, రామాపురం, ఒంటిమిట్ట, సిద్దవటం గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో కళాశాలలకు నిర్ణీత సమయంలో చేరు కోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి స్పంది స్తూ విద్యార్థుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని అధికారులకు సంబంధిత ఆర్టీసీ అధికారులకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, ఖాదర్‌వల్లి, రవి పాల్గొన్నారు.

సచివాలయంలో సమస్యలు పరిష్కరించాలి

కడప (సెవెన్ రోడ్స్), ఆగస్టు 4 : సచివాలయ ఎనర్జీ అసిస్టెంటు/సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్రీడా రవాణా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున మాట్లాడుతూ గ్రామ వార్డుసచివాలయ వ్యవస్థలో భాగంగా 7329 మంది ఎనర్జీ అసిస్టెంటు /సెక్రటరీలు నియమించబడ్డారు. ఇందులో పనిచేసే 18 కేటగిరీలకు చెందిన ఉద్యోగులు వారికి కేటాయించిన సచివాలయ పరిధిలోని విధులను మా త్రమే నిర్వర్తించేవారు. కానీ ఎనర్జీ సెక్రటరీలు మాత్రం గ్రామ సచివాలయం దాటి సుమారు 15కిమీ మేర సీనియర్ విద్యుత్ ఉద్యోగులు చేసే పనిని సైతం చేస్తున్నారన్నారు.

సిటీ బస్సులు ఏర్పాటు చేయాలని సీపీఐ వినతి

కడప నగరంలో సిటీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని, ఆర్టీసీబస్టాండు ప్రాంగనాన్నిఅభివృద్ధి చేయాలని సీపీఐ నాయకులు ఆదివారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ మాట్లాడుతూ కడప ప్రజల ప్రయాణికుల సౌకర్యార్థం కడపలో సిటీ బస్సు సీర్వీసులను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండు కు రెండు వైపులా ఉండే ప్రధాన రోడ్లు ఎత్తు పెరిగిన నేపథ్యంలో బస్టాండు ప్రాంగణంలో వర్షం మురుగునీటితో అక్కడక్కడా మురికి కుంటలుగా, కంపచెట్లతో దోమలకు నిలయంగా మారిన నేపథ్యంలో బస్టాండు ప్రాంగణమంతటినీ పరిశుభ్రం చేసి ఎత్తు పెంచి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేయాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయకార్యదర్శి ఉద్దె మద్దిలేటి, కార్యవర్గసభ్యులు మనోహర్‌రెడ్డి, మల్లిఖార్జున, భాగ్యలక్ష్మి, లింగన్న, అంకుశం, రాముడు తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, ఆగస్టు 4: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మతల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.భక్తులు అమ్మవారికి వారి మొక్కులు తీర్చుకుని వారి బంధుమిత్రులు, స్నేహితులతో అమ్మవారి సన్నిధిలో విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆరగించారు. సమీపంలోని వీరభద్రస్వామి, సాయిబాబా, శివాలయం, ఆంజనేయస్వామి, అక్కదేవతలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కడప (కలెక్టరేట్), ఆగస్టు 4: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక డీఆర్‌వో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అమరావతిలో సీఎం చంద్రబాబుతో జరిగే సమావేశానికి కలెక్టర్ హాజరవుతున్నందున గ్రీవెన్స్‌సెల్‌ను డీఆర్‌వో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జేసీ, ఇతర అధికారులు వర్చువల్‌గా కార్యక్రమానికి హాజరవుతారు.

నేడు ప్రత్యేక కంటి వైద్యశిబిరం

వేముల, ఆగస్టు 4:మండల కేంద్రమైన వేముల ప్రభుత్వ వైశాల వద్ద సోమవారం ప్రత్యేక కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కావున కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన డీఏఈ ఉద్యోగులు



వేముల, ఆగస్టు 4: మండలంలోని తుమ్మలపల్లెలో ఉన్న యూసీఐఎల్‌ను డీఏఈ ఉద్యోగులు సందర్శించారు. ప్రధాన మంత్రి కార్యాలయం కిందికి వచ్చే డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ 2024లో స్థాపించబడి 70ఏళ్ల పూర్తయింది. యురేనియం ఉత్పత్తిలో ముఖ్యమైన సదుపాయమన్నారు. అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ మరియు రీసెర్చ్ ప్రతినిధులు, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ తదితరులు పారిశ్రామిక సందర్శన పథకం, సాంస్కృతిక కార్యక్రమాల వేడుక కింద సౌకర్యాలను సం దర్శించారు. సుమన్ సర్కార్ వారిని స్వాగతించారు. అధునాతన యూనిట్, చుట్టుపక్కల ఇంజనీరింగ్, హౌస్ కీపింగ్, భద్రతా కార్యక్రమాలను అనుసరించడం చూసి వారు అభినందించారు. ఈ పర్యటనలో మంజరేకర్, శేఖర్ పాటిల్, మహేందర్ సింగ్, ఫ్రాన్సిస్, ఆంథోనీ, రాబర్ట్, సోంజోయ్ చటర్జీ, విపిన్ కుమార్‌శర్మ, హిమాన్షు తివారి పాల్గొన్నారు. డీఏఈ ప్లాటినం జూబ్లీ కల్చరల్ ఈవెంట్ సెలబ్రేషన్ సందర్భంగా అందించిన మద్దతు, ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌లో ఎన్‌ఆర్‌ఐల చేరిక

కడప(కలెక్టరేట్), ఆగస్టు 4: కాంగ్రెస్ పార్టీ కడప నియోజక వర్గ ఇన్‌చార్జ్ అఫ్జల్‌ఖాన్ సమక్షంలో ఆదివారం ఎన్‌ఆర్‌ఐలు రఫీఖాన్, అబ్దుల్ సలాం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ముస్లింలకు చాలా మేలు జరిగిందన్నారు. రిజర్వేషన్లు, మైనార్టీ రుణాలు, హజ్ యాత్రికులకు ప్రత్యేక ప్యాకేజీ కల్పించిన ఘనత వైఎస్‌దేనన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో వైఎస్ షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదిశగా పార్టీ పూర్వ వైభవానికి పాటుపడతామన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన సానే రాహుల్



ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు తెలుపుతున్న సానే రాహుల్

చక్రాయపేట, ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చక్రాయపేట మండలం నెర్సుపల్లె మాజీ సర్పంచు సానే సుబ్బరామయ్య కుమారుడు టీడీపీ యువ నాయకుడు సానే రాహుల్ కలిశారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. మండలంలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సానేరాహుల్ తెలిపారు.

విద్యాభివృద్ధికి 'ఏకలవ్య' సహకారం


● గౌరవ సలహాదారు శ్రీనివాసులు



మాట్లాడుతున్న గునిశెట్టి శ్రీనివాసులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4 :విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏకలవ్య సంస్థ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆ సంస్థ గౌరవ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కడప నగరం సంస్థ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గల పిల్లల్లో దాగి ఉన్న కళలు, నైపుణ్యాలకు పదను పెట్టే సహ పాఠ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి సంస్థ సభ్యులు, ఉపాధ్యాయుల సహకారంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమాలు చేపట్టడం సంతోసంగా ఉందన్నారు. ఇది మరింత చేరువ కావాలని, అందుకు సేవాభావంతో సభ్యులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సమన్వయకర్త సుదర్శన్, ప్రాజెక్టు మేనేజరు సంగీత, సభ్యులు బాలాజీ, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, వరప్రసాద్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4 : కడప బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించిందని కడప ఎంఈవో గంగిరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో స్వాతంత్ర్య దినోతవ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని విద్యార్థులకు ఇటువంటి పోటలు నిర్వహించడం అభినందీయన్నారు. ఈ కార్యక్రమంలో రాజశే ఖర్‌రాహుల్, సునీత, మృత్యుంజయరావు, దేవదత్తం, బాలయల్లారెడ్డి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, అరుణ, మధుసూదన్, సరస్వతి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు నిధులు విడుదల చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4 : రాష్ట్రంలో ఈ నెల 8న జరిగే ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు గ్రాంటు విడుదల చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సిద్ధం, తల్లిండ్రుల సమావేశ నిర్వహణ, భోజనాల పంపిణీ ఇతర ఖర్చుల కోసం ప్రభుత్వం వెంటనే ఎన్నికల నిర్వహణ గ్రాంటును ప్రతిపాఠశాలకు విద్యార్థులను బట్టి విడుదల చేయాలన్నారు. దీంతో పాటు సమస్యాత్మక గ్రామాలు ఏమైనా ఉంటే ముందుగానే గుర్తించి రక్షణ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు తాపీగా ఎన్నికలు నిర్వహించేందుక అవకాశం కల్పించాలని తెలిపారు. గతంలో జరిగిన అనుభవాలు దృష్టిలో పెట్టుకుని పకడ్బందీగా ఏర్పాట్లుకు శ్రీకారం చుట్టాలని కోరారు.

పునర్విభజన హక్కులు నెరవేర్చాల్సిందే

● ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ



మాట్లాడుతున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 4 : పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి రావాలసిన హక్కులన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని, లేదంటే ప్రజా ఉద్యమం మొదలవుతుందని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ హెచ్చరించారు. ఆదివారం కడప నగరం ఐఎంఏ హాలులో రాష్ట్ర కన్వెన్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రజల హక్కు అయిన ప్రత్యేక హోదాఅంశాన్ని కూటమి ప్రభుత్వం తప్పుదారి పట్టించిందని ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్యాకేజీతో పబ్బం గడుపుకుంటుందని చెప్పారు. ఈ మధ్యకాలంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు సభల్లో ప్రత్యేక హోదా కోసం ఏ ఒక్క నాయకుడు గొంతెత్తకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యేక హోదా వస్తర ఆస్త్రంలో మరింత పరిశ్రమలు వస్తాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రం అన్నిరకాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరరామరాజు, రాష్ట్ర కార్యదర్శులు జయవర్ధన్, సుబ్బమ్మ, బీవీఎస్ రాజు, జేవీ నరసింహమూర్తి, రామరాజు. గౌరీ, రాజానాయుడు, రామచంద్ర, డాక్టర్ ప్రవల్లిక , రఘువంశ ప్రతాప్, ఈవీఎస్ చైతన్య, సురేంద్ర, పోతులయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు దశల వారీ పోరాటం

● తహసీల్దార్ల బదిలీల్లో భారీ అక్రమాలు ● సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప (సెవెన్ రోడ్స్), ఆగస్టు 4 :ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు దశల వారీ పో రాటాలకు సమాయత్తం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో చంద్ర మాట్లాడుతూ కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన కడప జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు, విశాలమైన భూ భాగం, సమృద్ధిగా మానవవనరులు ఉన్నాయన్నారు. అయినా అవకాశవాద రాజకీయాలకు బలై అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, జిల్లాలో చెప్పుకోదగ్గ భారీ పరిశ్రమ లేకపోవడం వల్ల నిరుద్యోగ యువత పొట్టచేతబట్టుకుని పట్టణాలకు, గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారన్నారు. వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు కరువై, ఇతర కూలి పనులు లేక పేదలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారన్నారు. పలు కుటుంబాలు పూట గడవక అల్లాడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షా 25వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో జిల్లా స్వరూపం మారుతుందన్న ఆశలపై గత పాలక ప్రభుత్వాలు నీళ్ల చల్లుతూ వచ్చాయని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, పి.చంద్రశేఖర్, ఎంవీ సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, వీరశేఖర్, వేణుగోపాల్, కేసీబాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాలు







ముద్దనూరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, ఎర్రగుంట్ల, మైలవరంలో బోనాలతో భక్తులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 4: ఆశాఢమాసం అమావాస్య రోజున చౌడేశ్వరీదేవి పుట్టినరోజును ఆదివారం ఎర్రగుంట్లలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు పెట్టేందుకు మహిళలు పెద్దఎత్తున వచ్చారు. కోలాటంతో బోనాలు తీసుకుని నాలుగురోడ్ల కూడలి వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి వడిబియ్యం పెట్టి బోనాలు సమర్పిం చారు. బోనాలు ఎత్తుకుని చేసిన కోలాటం అందరినీ అలరించింది. అమ్మవారికి ఈ సందర్భంగా విశేష అలంకారం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

మైలవరం..: మండల పరిధిలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం, కరమలవారిపల్లి గ్రామాల్లో చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దొమ్మరనంద్యాల గ్రామంలో మహిళలు 216 కలశ బిందెలు ఎత్తుకుని అమ్మవారి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. వేపరాల గ్రామంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పాల్గొన్ని చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ముద్దనూరు..: మండల పరిధి ఉప్పలూరు గ్రామంలో ఆదివారం చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా చౌడేశ్వరీ దేవి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో ఆదివారం చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని నాగులకట్టవీధి చౌడేశ్వరీదేవి అమ్మవారు ఆలయంలో ఉదయం 8 గంటలకు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం వద్ద నుంచి గ్రామోత్సవం ప్రారంభమై సంజాములమోటు, పలగాడివీధి, మెయిన్‌బజార్, పాత బస్టాండు మీదుగా చౌడేశ్వరీ దేవాలయం వద్దకు మహిళా భక్తులు గ్రామోత్సవం చేరుకుంది. ఆలయంలో అమ్మవారి అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామలింగ చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఆలయం వద్ద నుంచి మహిళా భక్తులు కలశం బిందెలతో గ్రామోత్సవం జరిగింది. గ్రామోత్సవం వెంట బిందెసేవ, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. పై ఆలయాల వద్ద నుంచి చౌడేశ్వరీదేవి అమ్మవారి ప్రతిరూపంతో వేషధారణ ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మండలంలోని మోరగుడి గ్రామంలో చౌడేశ్వరీదేవి ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం కమిటీ అధ్యక్షుడు గంజికుంట తిరుమలదాసు, బడిగించల చంద్రమౌళి, బడిగించల విజయలక్ష్మి, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని టి.కోడూరు గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి జ్యోతులను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: చౌడేశ్వరి అమ్మవారి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని వివిధ చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్ని ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సుబ్బిరెడ్డి కొట్టాలు,వసంత పేటలోని చౌడేశ్వరీదేవి ఆలయం,ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజి మహాచౌడేశ్వరీదేవి ఆలయంలో ,వినాయకనగర్, ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో అమ్మవారికి, శ్రీరాంనగర్ చౌడేశ్వరీదేవి ఆలయంలో పూజలు, జపహోమాలు నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: శ్రీరాంనగర్ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ధర్మకర్త మోతుకూరు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో విశేష పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం రాత్రి 108 బిందెలతో అమ్మవారికి అభిషేకాలు, పాలాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి మల్లికార్జున, బొలిశెట్టి శ్రీరాములు, పల్లా వీరయ్య, పుల్లగూర వెంకటరమణ, సానా సుబ్బమ్మ, మోతుకురు హరికుమార్, మునిస్వామి, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు ప్రొద్దుటూరులో ఘనంగా జరిగాయి.ఆదివారం అమ్మవారి జయంతిని అమావాస్య సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ పేట నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్నితీసుకుని సుహాసినిలు కలశాల తో ఊరేగింపుగా మేదరవీదిలోని శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం వరకు అంగరంగ వైభవంగా ఊరేగించారు. నృత్యాలు పద్యాల ఆలాపనతో భక్తుల ఊరేగింపు అలరింపచేశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి 1.28 లక్షలవిలువచేసే బంగారు కళ్ళను అంపావతిన నాగరాజు,లక్ష విలువైన వెండి గొడుగును గిద్దలూరు ఈశ్వరయ్య , 70 వేల విలువ చేసే వెండి పళ్ళెం ను అల్లి క్రిష్ణయ్య, 5.50 లక్షల డిపాజిట్ పత్రాన్ని పీవీ రమణయ్య కుటుంబసభ్యులు, 50 వేల డిపాజిట్ పత్రం, రెడ్డి సుబ్బరాయుడు, మరో 50 వేల డిపా జిట్‌ను పోసా వెంకటలక్షుమయ్య అందజేశారు. ఈ సందర్భంగా 2500 మంది భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి, దేవాంగ సంఘం నాయకులు ఉట్టి లక్ష్మీనారాయణ, మచ్చా సుబ్బరాయుడు గిద్దలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: మండలంలోని చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, అన్నదా నాలు నిర్వహించారు. పర్లపాడు, అర్కటవే ముల, పగిడాల, తొండలదిన్నె, చిన్నజొన్నవరం గ్రామాల్లో చౌడేశ్వరి ఆలయాలు ఉన్నాయి. అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణ, అభి షేకాలు, పూజలు జరిగాయి. ఈ జయంతి ఉత్సవాల్లో పెద్దఎత్తున మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరులో పుష్పాలంకరణలో చౌడేశ్వరీదేవి అమ్మవారు, కలశాలు తీసుకెళుతున్న భక్తులు

భగవంతున్ని స్మరించుకోవాలి



మాట్లాడుతున్న దివ్యజ్ఞానానందగిరిస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4: చిత్తశుద్ధి, ఏకాగ్రతతో భగవంతున్ని స్మరించుకోవాలని తొగటవీర క్షత్రియ కులగురువు దివ్యజ్ఞానానందస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆచార్యుల కాలనీలోని భాష్యం హైస్కూలులో ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పనులు తలపెట్టినప్పుడు శక్తిస్వరూపిణి అయిన అమ్మవారి అనుగ్రహం ఎప్పుడు ఉంటుందన్నారు. శ్రీచక్ర చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని స్వామిజీ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య, తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, పల్లా శంకర్, సుబ్బయ్య, సిద్దయ్య, లక్ష్మీనారాయణ , రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్యానికి దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల, ఆగస్టు 4 : బిందు, తుంపర సేద్యపరికరాలకు రైతులు ఈ నెల 5 నుంచి రైతుసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మ్యాప్, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, నకలు,చెక్కుబందీ సమర్పించాలని తెలిపారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో గరిష్టంగా 2.18లక్షల వరకు బిందుసేద్య పరికరాలు అమర్చుకోవచ్చన్నారు. ఐదెకరాల నుంచి పది ఎకరాల మధ్య భూమికలిగిన రైతులు 70 శాతం గరిష్టంగా 3.46 లక్షల వరకు బిందు పరికరాలు అమర్చుకోవచ్చన్నారు. తుంపర్ల సేద్య పరికరాలు 45-55 శాతం రాయితీతో అందిస్తామన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

పోరుమామిళ్ల, ఆగస్టు 4 : ఉపాధి హామీ ద్వారా నూటికి నూరు శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చని పోరుమామిళ్ల ఏపీవో రవీంద్రరెడ్డి తెలిపారు. ఐదెకరాలు లేదా అంతకన్నా తక్కువ భూమి కలిగిన చిన్న సన్న కారు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, చీనీ, సన్న నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు డ్రాగన్ వంటి పండ్లతోటలు నాటుకుంటే మూడేళ్ల పాటు ప్రభుత్వం ద్వారా వంద శాతం చార్జీలు చెల్లిస్తారన్నారు. రోజా, మల్లె, మునగ సాగు చేసే రైతులకు రెండుసంవత్సరాల నిర్వహణ చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు ఉపాధిహామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి లక్ష్మీరెడ్డి



లక్ష్మీరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో నిర్మల ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కాశినాయన ఆగస్టు 4: ఉపాధ్యాయుడుగా 38 సంవత్సరాలపాటు పనిచేసి ఆవృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి ఆరికట్ల లక్ష్మీరెడ్డి అని కాశినాయన ఎంఈవో ఓ.నిర్మల, గోపవరం ఎంఈవో రఘురామయ్య పేర్కొన్నారు. బాలాయపల్లె ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తూ జూలై 31న పదవీ విరమణచేసిన లక్ష్మీరెడ్డికి ఆదివారం గ్రామస్తులు ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానకార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం లక్ష్మీరెడ్డి,సీతమ్మ దంపతులను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ నాయకుడు విజయ్ కుమార్, ఏపీటీఎఫ్(257) నాయకుడు సూరా భాస్కర్‌రెడ్డి,ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ రమణారెడ్డి,అప్పాస్ జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్యయూటీఎఫ్ మండల బాధ్యుడు భాస్కర్‌రెడ్డి, గంగనపల్లెవాసి క్లాస్1 కాంట్రాక్టర్ బసిరెడ్డి చెన్నక్రిష్ణారెడ్డి, గంగనపల్లె ఆర్సీఎం ప్రధానోపాధ్యాయుడు జోజయ్య,ఎస్టీయూ నాయకుడు సుబ్రమణ్యం, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కామనూరులో టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఓ విద్యార్థి, యువత డ్రగ్స్ రహిత సమాజంకోసం పాటుపడుదాం అన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేషు, ఉపాధ్యక్షుడు చేతన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేష్, డాక్టర్ వరకుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన నిరసన

ముద్దనూరు ఆగస్టు4: జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీని మూతవేయాలని పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారానికి పన్నెండవ రోజుకు చేరుకుంది.గ్రామస్థుల నిరసనకు మద్దతుగా మహిళా నాయకురాళ్ళు కడప నగర టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి,జిల్లా గిరిజన సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి సంఘీభావం ప్రకటించారు.

బీసీ భవన నిర్మాణానికి చేయూతనందించాలి



ఐక్యత చాటుతున్న పూలే, మండల బీసీ సాధన కమిటీ నాయకులు

బద్వేలు రూరల్, ఆగస్టు 4 : పట్టణంలో బీసీ భవన్ ఏర్పాటు చేసుకునేందుకు టీడీపీ ప్రభుత్వం చేయూతనందించాలని పూలే, మండల బీసీ భవన సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి కావేటి రమేశ్‌యాదవ్ కోరారు. పూలే మండల బీసీ భవన సాధన కమిటీ సమావేశాన్ని ఆదివారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాలు, నియోజకవర్గాల్లో బీసీ భవనాలు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నీరుగుడ్డి బాలచెన్నయ్య, సింగరయ్యయాదవ్, నరసింహులు, మిర్చికాయల రమణయాదవ్, సుబ్బరాయుడు, బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషి



చేనేతలను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4: చేనేతల సంక్షేమానికి కృషి చేస్తామని అఖిలభారత పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షుడు వద్దినరసింహులు పేర్కొన్నారు. ఆదివారం రామేశ్వరంలోని భద్రావతి భావన్నారాయణస్వామి ఆలయంలో జిల్లా పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 60 సంవత్సరాలు పైబడి చేనేత వృత్తిని కొనసాగిస్తున్న 10 మంది చేనేత దంపతులను ఘనంగా సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు చెన్నావెంకటకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటనరసింహమూర్తి , రామేశ్వరం పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు మేరువ పెంచలయ్య, అఖిల భారత పద్మశాలీయ సంఘం సభ్యుడు నందం లక్ష్మణకుమార్, చెన్నా చంద్రబాబు, పద్మశాలీయ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జింకా విజయలక్ష్మి, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గునిశెట్టి సునంద, డాక్టర్ మునిరాంప్రసాద్, బోగా ఆనంద్, అగ్గారపు శ్రీనివాసులు, వద్దిబాలుడు, జానకీరామయ్య, సింగరయ్య, మునిస్వామి, సదానంద పాల్గొన్నారు.

ఆపన్నులకు మానవత అభయహస్తం

ఎర్రగుంట్ల, ఆగస్టు 4: ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందించి మానవత స్వచ్ఛంధ సంస్థ ఆదుకుంది. ఎర్రగుంట్లనడివూరుకు చెందిన వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో ఒక కంటి చూపును పోగొట్టుకున్నాడు. అయనకు మానవత సంస్థ ఛైర్మన్ డి.రఘురామిరెడ్డి, మండల యూనిట్ అధ్యక్షుడు ఎస్.రామాంజనేయరెడ్డి చేతులమీదుగా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. అలాగే కిడ్నీలు పాడై, వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకుంటూ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న శాంతినగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌వలీకి రూ.5వేలు విలువచేసే రేషన్‌ను ఆర్థిక సహాయంగా అందజేశారు.కార్యదర్శి జి.రంగయ్య, జి.మల్లికార్జునరెడ్డి, ఎస్.మధుసూదన్‌రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, సుబ్బరాయుడు, జి.చెన్నకేశవరెడ్డి,రమేష్‌బాబు, సాంబశివారెడ్డి, కే.గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం



108 సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4: ఆపదలో ఉన్న వారిని కాపాడటానికి 108 సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధుగోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మార్కెట్‌యార్డులో 108 సిబ్బంది 13 మందిని 108 డిస్ట్రిక్ మేనేజర్ రెడ్డప్ప రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలసూర్యరావు, కార్యదర్శి శ్రీధర్ శర్మ, మిడ్‌టౌన్ అధ్యక్షుడు తుకారాం, కార్యదర్శి రాజు, శివకుమార్, ప్రభు, జగదీషు, నరసింహరావు, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పోరుమామిళ్ల ఆగస్టు 4: మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్ కాలనీకి చెందిన చిరంజీవి(37) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తిమోథి తెలిపారు. మద్యానికి బానిసైన చిరంజీవి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అధ్వానంగా ఎంఈవో కార్యాలయం



అధ్వానంగా ఉన్న గోడలు పుచ్చులు పట్టిన వాకిలి, కిటికీ, పైకప్పు పెచ్చులూడిన దృశ్యం



చాపాడు, ఆగస్టు4: మండల కేంద్రమైన చాపాడులోని మండల విద్యాశాఖ కార్యాలయ భవనం పూర్తిగా దెబ్బతింది. 20 ఏళ్ల క్రితం నాలుగు గదులు నిర్మించారు. ఈ గదులన్నీ పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గదులన్నీ గోడలు ఉరుస్తున్నాయి. కిటికీలు, వాకిళ్లు తుప్పుపట్టాయి. ఇవి కొన్ని దెబ్బతిని ఊడిపోయాయి. నేడో రేపో కూలడానికి కార్యాలయం సిద్ధంగా ఉంది. కార్యాలయంలోని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. కంప్యూటర్లు, పుస్తకాలు, ఇతర రికార్డులు ఉంచుకునేందుకు కూడా వర్షానికి తడవకుండా ఉండు స్థలం లేదు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు ఇక్కడే కొంత కాలంపాటు నిలువ ఉంచుతారు. కాగా కార్యాలయంలో సరైన సౌకర్యాలు లేనందున చాలా ఇబ్బంది పడుతున్నామని ఎంఈవో రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని 62 పాఠశాలలు ఉన్నాయి. 148 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు ఈ కార్యాలయంలోనే ఎక్కువగా తిష్ఠవేస్తుంటారు.

దేవదాయశాఖ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

కాశినాయన ఆగస్టు4: రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం నారాయణరెడ్డిని శనివారం రాత్రి నెల్లూరులోని స్వగృహంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు కొండా దుగ్గిరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియపరిచారు. ఈసందర్భంగా మండల సమస్యలతోపాటు జోతిక్షేత్రంలోని కాశిరెడ్డినాయన దేవాలయ సమస్యను మంత్రిదృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కచ్చితంగా కేంద్ర అటవీశాఖ మంత్రితోపాటు సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా సమస్యను పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసినవారిలో బద్వేల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రంతు ఇతరనాయకులు ఉన్నారు.

